తగ్గిన వాన.. తొలగని ముంపు



గణపవరం: పిప్పర వద్ద ప్రమాదకరంగా ఎర్రకాలువ ప్రవాహం



గణపవరం: ఉండి కాలువ గట్టుమీద నుంచి పొలాల్లోకి వరదనీరు

- ఎర్రకాలువ ఉగ్రరూపం
- బిక్కుబిక్కుమంటూ సమీప ప్రాంతవాసులు
- వరద నీటిలోనే వరి పైరు

గణపవరం: ఎర్ర కాలువ ఉగ్రరూపం రోజురోజుకూ పెరుగుతూ గణపవరం మండలంలో రైతులకు, ప్రజలకు కంటిమీద కునుకు లేకుండా చేస్తోంది. గణపవరం మండలంలోని కోమర్రు వద్ద ఎర్రకాలువ మండలంలో ప్రవేశించి డి.కుముదవల్లి, వెంకట్రాజపురం, పిప్పర, మొయ్యేరు, ముప్పర్తిపాడు, కేశవరం, కొండేపాడు మీదుగా ప్రవహిస్తుంది. ఈ కాలును గణపవరం మండలం నుంచి యనమదుర్రు మురుగు కాలువగా పిలుస్తారు. అధికార యంత్రాంగం యనమదుర్రు మురుగుకాలువ పరీవాహక గ్రామాల్లో నిరంతరం పహరా కాస్తూ గండ్లు పడకుండా చర్యలు తీసుకుంటున్నారు. పిప్పర, కొండేపాడులోకి వరదనీరు ప్రవేశించే అవకాశం ఉండటంతో ఇసుక బస్తాలతో గట్టును పటిష్టం చేశారు. మండలంలోని అప్పనపేట శివారు సాగిపాడు వద్ద ఉండి పంట కాలువ పొంగి ప్రవహిస్తోంది. ఇక్కడ గట్టు పల్లంగా ఉండటంతో గట్టు మీదుగా భారీగా వరదనీరు పొంగి ప్రవహిస్తూ సమీప పొలాలను ముంచెత్తుతోంది. ఇప్పటికే పిప్పరలోని ఆరవ వార్డు కాలనీలోకి వరదనీరు ప్రవేశించింది. రోడ్లన్నీ మోకాలిలోతు నీటిలో మునగడంతో



గణపవరం: పిప్పరలో వరదనీటిలో కాలనీ రోడ్లు



గణపవరం: పొలంలో చేరిన వర్షం నీటిని ఇంజన్‌తో బయటకు తోడుతున్న రైతులు

ఆప్రాంత వాసులు ఇబ్బంది పడుతున్నారు. ఈ ప్రాంతంలోని విద్యుత్ సబ్‌స్టేషన్, ప్రాథమిక పాఠశాల ఆవరణలోకి వరదనీరు ప్రవేసింది. పిప్పర, కేశవరం, వెంకట్రాజపురం, మొయ్యేరు, ముప్పర్తిపాడు, కోమర్రు, డి.కుముదవల్లి, కొండేపాడు, కాశిపాడు,చిలకంపాడులో సార్వానాట్లు వేసిన పొలాల్లోకి ఎర్రకాలువ వరదనీరు చేరింది.

అన్నదాతల ఇక్కట్లు



గణపవరం: నారుమడిలోకి వరద నీరు వెళ్లకుండా గట్టు ఎత్తు చేసుకుంటున్న రైతు



ఉంగుటూరు: కైకరం ఆయకట్టులో ముంపునకు గురైన పంట పొలాలు

భారీ వర్షాలకు నీటమునిగిన వరినాట్లు, నారును సంరక్షించుకోవడానికి రైతులు నానా పాట్లు పడుతున్నారు. ప్రస్తుతం చేలల్లో మోకాలి లోతున నీరు నిలిచి ఉంది. పంట కాలువలు, మురుగు కాలువలు, పిల్ల కాలువలు నిండు కుండల్లా ప్రవహించడంతో పొలాల్లోని నీరు చుక్కకూడా బయటకు వెళ్లే అవకాశం లేదు. దీంతో నాట్లు, నారు కుళ్లిపోయే ప్రమాదం ఉంది. దీనితో రైతులు నారుమడులు, వరినాట్లను సంరక్షించుకోవడానికి యుద్ధప్రాతిపదికన చర్యలు చేపట్టారు. గణపవరం, సరిపల్లె, కొత్తపల్లి, వరదరాజపురం, జల్లికొమ్మరలోని రైతులు పొలాల్లో చేరిన నీటిని ఇంజన్లు ఏర్పాటు చేసి బయటకు తోడుకుంటున్నారు. సోమవారం కాస్త తెరిపిచ్చిన వాతావరణం సోమవారం మరికొంత ఉపశమనం కలిగించింది. వాతావరణశాఖ మరో మూడు రోజులు భారీ వర్షాలకు కురిసే అవకాశం ఉందన్న హెచ్చరికలతో రైతులు ఆందోళనకు గురవుతున్నారు.

ముంపునీటిలో 1,350 ఎకరాల నాట్లు

నిడమర్రు: మండలంలో కురుస్తున్న వర్షాలతో సోమవారానికి 1,350 ఎకరాల నాట్లు, 55 ఎకరాల నారుమడులు నీటమునిగినట్లు నిడమర్రు ఏవో తెలిపారు. నిడమర్రుమండలంలో 3,563 ఎకరాల్లో సార్వా సాగుకు రైతులు సిద్ధం చేసుకుంటుండగా ఈ వర్షాలతో పలు గ్రామాల్లో నష్టం వాటిల్లిందన్నారు. ప్రస్తుతం బువ్వనపల్లి, అడవికొలను, పెదనింద్రకొలను, ఎనికేపల్లితోపాటు కొల్లేరులోని కాంటూరు పరిధిలోని వరి పొలాలు ముంపునీటితో నిండి ఆక్వా చెరువులను తలపిస్తున్నాయి.

ముంపు బారిన వేలాది ఎకరాల్లోని వరి పైరు

భీమడోలు: వరద నీరు పొలాల్లోంచి దిగకపోవడంతో భీమడోలు, గుండుగొలను, పూళ్ల, ఎంఎంపురం, సాయన్నపాలెం, అంబర్‌పేట, కోరుకల్లు, రత్నాపురం తదితర గ్రామాల్లోని రైతులు ఆందోళన చెందుతున్నారు. ఇప్పటికీ వేలాది ఎకరాల్లో వరి చేలు ముంపుబారిన పడ్డాయి. కొన్ని చోట్ల వరి నారుమడులు, నాట్లు కుళ్లిపోతున్నాయి. సాయన్నపాలెం పంట పొలాలకు సమీపాన ఉన్న రామన్నకోడు డ్రెయిన్‌లో పేరుకుపోయిన తూడు, గుర్రపు డెక్కల వల్ల ముంపు నీరు కిందకు వేగంగా ప్రవహించడం లేదు. ఎంఎంపురంలో పుప్పాల వారి కోడు, తుమ్మకోడు, వాలు కోడు డ్రెయిన్లు పూడుపోవడంతో అక్కడ పంట పొలాలను మునిగిపోయాయి. రత్నాపురం, కోరుకల్లు ఏరియాల్లో ఆక్వా చెరువులు పంట బోదెలను ఆక్రమించుకుని కట్టడాలు కట్టడం వల్ల నీరు కొల్లేరులోకి కాకుండా పొలాల్లోకి చేరుతోంది. సంబంధిత అధికారులు సమస్యలను గుర్తించి వెంటనే పరిష్కార మార్గాలను చూపాలని రైతులు కోరుతున్నారు.

ఉధృతంగా గుండేరు, మొండికోడు వాగులు

దెందులూరు: నాలుగు రోజులుగా కురుస్తున్న వర్షాలకు దెందులూరు మండలం సత్యనారాయణపురం వద్ద గుండేరు, కొవ్వలి మొండికోడు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. ఏలూరు ఆర్డీఓ షేక్ ఖాజావలి, ఇరిగేషన్ డీఈ అర్జున్, దెందులూరు తహసీల్దార్ జీ.జితేంద్ర, ఏఓ గద్దె రమేష్ పరిశీలించారు. ప్రస్తుతానికి ఎటువంటి ప్రమాదకరమైన పరిస్థితులు లేవని ఇరిగేషన్ డీఈ అర్జున్ అన్నారు. ఎటువంటి ప్రమాదకర పరిస్థితులు తలెత్తినా గండ్లు కొట్టేందుకు జేసీబీలు సిద్ధం చేశామన్నారు.

ఉప్పొంగుతున్న చెరువులు

ఉంగుటూరు: ఆరురోజుల నుంచి విడవకుండా కురుస్తున్న వర్షాలకు వరి పంట మెత్తం మునిగిపోయింది. ఎక్కువ కాలం ముంపు నీటిలో ఉంటే ఇటీవల వేసిన నాట్లు తిరిగి నాట్లు పుంజుకోవడం కష్టమని రైతులు అంటున్నారు. కైకరం, రావులపర్రు, రాచూరు, వెల్లమిల్లి, బాదంపూడి, ఉంగుటూరులో ఎక్కువ పంట దెబ్బతింది. మండలంలో విస్తరించి ఉన్న ఏలూరు గోదవరి కాలువ, పోలవరం కాలువ, తాడిపూడి కాలువ నీటితో నిండుగా ప్రవహిస్తున్నాయి. మెట్ట ప్రాంతంలో విస్తరించిన 30 మైనర్ ఇరిగేషన్ చెరువులు నిండిపోయాయి. ఇప్పటికే కొన్ని చెరువులు ఉప్పొంగి రహదార్ల మీదుగా ప్రవహిస్తున్నాయి. డెల్టాలో విస్తరించి ఉన్న తోకలపల్లి, పందికోడు మేజర్ మురుగు కోడులతోపాటు రంగరావుకోడు, రాచకోడు, తదితర మీడియం మైనర్ డ్రెయిన్లు పొంగి ప్రవహిస్తున్నాయి.



ఉంగుటూరు: నిండుకుండలా ఎ.గోకవరం పెద్ద చెరువు



దెందులూరు: ఉధృతంగా ప్రవహిస్తున్న గుండేరు వాగు



నిడమర్రు: పెదనింద్రకొలను కాంటూరు పరిధిలో ముంపుబారిన వరి నాట్లు



భీమడోలు: సాయన్నపాలెంలో మునిగిన పంట చేలు

క్లుప్తంగా

కరాటే పోటీల్లో బువ్వనపల్లి విద్యార్థుల ప్రతిభ



కరాటే పోటీల్లో సత్తాచాటి పతకాలు అందుకున్న విద్యార్థులు

నిడమర్రు: అంతర్జాతీయ కరాటే పోటీల్లో ప్రతిభ చూపి లైఫ్ కరాటే శిక్షణా సంస్థ విద్యార్థులు 16 పతకాలు సాధించినట్టు సంస్థ నిర్వాహకుడు, కోచ్ యు. కల్యాణ్ సందరం తెలిపారు. సోమవారం బువ్వనపల్లిలో లైఫ్ కరాటే శిక్షణ కేంద్రంలో ఆయన మాట్లాడుతూ ఆదివారం చెన్నైలో మౌంట్ పోర్టు ఇండోర్ స్టేడియంలో నిర్వహించిన ఛాలెంజర్స్ కప్ ఇంటర్నేషనల్ ఓపెన్ కరాటే చాంపియన్‌షిప్ పోటీల్లో లైఫ్ కరాటే శిక్షణ సంస్థ విద్యార్థులు 16 పతకాలు సాధించారన్నారు. దీనిలో 7 గోల్డ్, 5 సిల్వర్, 4బ్రాంజ్ మెడల్స్ ఉన్నాయని తెలిపారు. బి.చరణ్, కె. దత్తత్రేయ, టి. పృథ్వీ, వి.పవన్ కనకతేజ, బి.చైతన్యతేజ, బి.పవన్ తేజ, కె. కావ్యశ్రీలక్ష్మి, కె.తేజశ్రీలక్ష్మి వివిధ విభాగాల్లో పతకాలు సాధించారన్నారు. కోచ్ బేతు ప్రకాష్, తల్లిదండ్రులు పాల్గొన్నారు.

కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాల సీజ్



వాహనాన్ని సీజ్ చేస్తున్న నిడమర్రు పోలీసులు

నిడమర్రు: కోళ్ల వ్యర్థాలు తరలిస్తున్న వాహనాలను సోమవారం నిడమర్రు, పెదపాడు పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వారు తెలిపిన వివరాల ప్రకారం తోకలపల్లి పరిధిలోని గ్రామాలకు కోళ్ల వ్యర్థాలతో వాహనం వెళ్తున్నట్లు సమాచారం రావడంతో సిబ్బందితో వెళ్లి అడ్డుకున్నట్లు నిడమర్రు ఎస్సై ఆర్ శ్రీను తెలిపారు. తోకలపల్లి గ్రామానికి చెందిన సైదు చిట్టిబాబును అదుపులోకి తీసుకుని కేసు నమోదు చేసి, వ్యర్థాలను తరలిస్తున్న వాహనాన్ని సీజ్ చేసినట్లు ఎస్సై తెలిపారు.

కోళ్ల వ్యర్థాల ధ్వంసం

పెదపాడు: మండలంలోని తోటగూడెం మీదుగా నాయుడుగూడెం వైపునకు కోళ్ల వ్యర్థాలతో వాహనం వెళ్లున్నట్లు సమాచారం రావడంతో పెదపాడు పోలీసులు దాడి చేశారు. తోటగూడెం సమీపంలో వాహనాన్ని స్వాధీనం చేసుకుని, డ్రైవర్‌ను అదుపులోకి తీసుకున్నారు. కోళ్ల వ్యర్థాలను ధ్వంసం చేసినట్లు పెదపాడు ఎస్సై శుభశేఖర్ తెలిపారు.


ఆధార్ నమోదుకు ప్రత్యేక శిబిరాలు

దెందులూరు: మండలం పరిధిలో ఈ నెల 23 నుంచి 27 వరకు ఆధార్ నమోదు, మార్పులు, చేర్పుల కోసం ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తామని ఎంపీడీఓ వీ.శ్రీలత అన్నారు. 23న దెందులూరు జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాలలో, 24న దెందులూరు జెడ్పీ ఉన్నత పాఠశాల, 25న గోపన్నపాలెం ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 27న కొవ్వలి ప్రభుత్వ ఉన్నత పాఠశాల, 23 నుంచి 24 వరకు పోతునూరు ఉన్నత పాఠశాల, 26న కొత్తగూడెం సచివాలయం, 27న రామారావుగూడెం సచివాలయం, 24 నుంచి 25వ తేదీ వరకు మేధినరావుపాలెం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, 26, 27న చల్లచింతలపూడి జెడ్పీ ఉన్నత పాఠశాలలో ఈ శిబిరాలు ఏర్పాటు చేస్తామన్నారు. ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని ఎంపీడీఓ కోరారు.

జగనన్న కాలనీలో రోడ్లు నిర్మించండి

భీమడోలు: జగనన్న కాలనీలో రోడ్లు నిర్మించాలని భీమడోలులో పర్యటించిన ఎమ్మెల్యే పత్సమట్ల ధర్మరాజును కాలనీ వాసులు మొరపెట్టుకున్నారు. భీమడోలులో ఆదివారం రాత్రి వరి ముంపు ప్రాంతాల పరిశీలనకు వచ్చిన ఎమ్మెల్యేను దిగుడుపాటి దిబ్బ కాలనీకి చెందిన మహిళలు, కుటుంబ సభ్యులు కలిసి తమ సమస్యలపై గోడు వినిపించారు. సమస్యలను పరిష్కరించాలని ఆయనకు కాలనీ వాసులు వినపతి పత్రం అందజేశారు. కాలనీలో రోడ్లు అధ్వాన్నంగా ఉన్నాయని వాపోయారు. కాలనీలోని రోడ్లను నిర్మించేందుకు తన వంతు కృషి చేస్తానని ఎమ్మెల్యే అన్నారు. వర్షం తగ్గుముఖం పట్టగానే కాలువ వెంబడి రోడ్డును నిర్మించేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

తోట ఎడ్వర్డ్‌కు లయన్స్ క్లబ్ పురస్కారం



సర్టిఫికెట్‌తో ఎడ్వర్డ్

దెందులూరు: ప్రభుత్వ ఉపాధ్యాయుడు, లయన్ తోట ఎడ్వర్డ్‌కు ఆదివారం ఇంటర్నేషనల్ ది గ్లోబల్ యాక్షన్ టీమ్ ఆనర్స్ పురస్కారం లభించింది. లయన్స్ క్లబ్ ఆఫ్ ఇంటర్నేషనల్ ప్రతిష్టాత్మకంగా ఇచ్చే పురస్కారం ఎడ్వర్డ్‌కు లభించడంపై లయన్స్ సభ్యులు హర్షం వ్యక్తం చేశారు. ఎన్‌జీవోగా, ప్రభుత్వ ఉపాధ్యాయుడిగా లయన్స్ క్లబ్ మెంబరుగా విద్య, వైద్యం, మౌలిక వసతుల కల్పన లక్ష్యంగా కృషి చేసినందుకు 2023 సంవత్సరానికి ఈ అవార్డు ప్రదానంచేసినట్టు తోట ఎడ్వర్డ్ అన్నారు. లయన్స్ సభ్యులు ఎడ్వర్డ్‌ను అభినందించారు.

కాలువలు, డ్రెయిన్లలో పూడికలు తొలగించాలి



కైకరం ఆయకట్టులో పరిశీలించి, రైతులతో మాట్లాడుతున్న ఆర్డీవో ఖాజావలి అధికారులు

ఉంగుటూరు: కాలువలు, డ్రెయిన్లలో పూడికలు తీయించి నీటి ప్రవాహానికి అడ్డులేకుండా చేయాలని ఇరిగేషన్ అధికారులను ఆర్డీవో ఖాజావలి ఆదేశించారు. ఉంగుటూరు మండలంలో ముంపుబారిన పడ్డ పంట పొలాలను ఆర్డీవో సోమవారం పరిశీలించారు. వెల్లిమిల్లి, బాదంపూడి, రాచూరు, కైకరంలోని ముంపు ప్రాంతాలను, కాలువలను ఆయన పరిశీలించారు. వెల్లమిల్లి రేవు వద్ద జాతీయ రహదారికి ఉన్న అండర్ టన్నెల్ కింద పూడిక తొలగించాలని రైతులు కోరడంతో సమస్యను పరిష్కరించాలని అధికారులకు ఆర్డీవో సూచించారు. రాచూరులో మేజరు డ్రెయిన్‌లో కలిసే మరో చిన్న డ్రెయిన్ ఆక్రమణను పరిశీలించారు. ఆక్రమణలను తొలగించాలని అధికారులకు సూచించారు. కైకరం వద్ద రైల్వే లైన్ వద్ద టన్నెల్ లేకపోవడంతో పంట పొలాలు మునిగిపోతున్నట్టు ఆర్డీవో గుర్తించారు. తహసీల్దారు వెంకటశివయ్య, ఆర్‌ఐ సత్యనారాయణ, ఆయా గ్రామాల వీఆర్వోలు పాల్గొన్నారు.

వరి పొలాలను పరిశీలించిన శాస్త్రవేత్త

దెందులూరు: ముంపునకు గురైన వరి పొలాలను సోమవారం ఏరువాక కేంద్రం సైంటిస్టు డాక్టర్ ఫణి కుమార్ అధికారులతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా వారు దెందులూరు, కొవ్వలి, పోతునూరులో పర్యటించి రైతులతో మాట్లాడారు. దెందులూరు, ఇతర ప్రాంతాల్లో బీఎల్-11 రకాన్ని ఎక్కువగా సాగు చేశారని, ఈ రకం వల్ల ఎటువంటి ఇబ్బంది లేదన్నారు. ముంపు పొలాల్లో రైతులు నీరు బయటకు వెళ్లేలా చూసుకోవాలన్నారు. ఐదు రోజుల్లో దిగువ ప్రాంతానికి నీరు వెళ్లకుండా పొలంలోనే నీరు ఉంటే నారు పాడవుతుందన్నారు. నారు రక్షణకు కేజీ యూరియా, కేజీ పొటాషియం మిశ్రమం చేసి వాడాలన్నారు. వారం, పది రోజులు తరువాత అయితే బావిస్టన్ ఒక గ్రాము ఒక లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలన్నారు. వ్యవసాయశాఖ అధికారుల సూచనలు, సలహాలు విధిగా పాటించాలన్నారు. వచ్చే పంట నుంచి 1235 రకం విత్తనం వ్యవసాయ పరిశోధన కేంద్రం మార్టేరు నుంచి సరఫరా అవుతుందని ఈ రకం విత్తనాన్ని రైతులు సాగుకు ప్రాధాన్యతనివ్వాలని సూచించారు. ఏఓ గద్దె రమేష్, ఎంపీడీఓ వీ.శ్రీలత, రైతులు ఉన్నారు.

వర్షంలోనూ సాగు పనులు ముమ్మరం



సానిగూడెంలో వరినాట్లు వేస్తున్న కూలీలు

దెందులూరు: మండలంలో అన్ని గ్రామాల్లో సాగు పనులు ముమ్మరంగా కొనసాగుతున్నాయి. నాలుగు రోజులుగా జోరుగా వర్షాలు కురుస్తున్నా రైతులు, వ్యవసాయ కూలీలు నాట్లు వేసే పనిలో నిమగ్నమయ్యారు. వాతావరణశాఖ వారం రోజుల పాటు వర్షాలు కురుస్తాయని ప్రకటించినా లెక్క చేయకుండా రైతులు నాట్లు పూర్తి చేస్తున్నారు.

177 అడుగుల జాతీయ పతాకంతో ప్రదర్శన



177 అడుగుల జాతీయ పతాకంతో దెందులూరు నర్సింగ్ కళాశాలలో ప్రదర్శన నిర్వహిస్తున్న విద్యార్థులు

దెందులూరు: జాతీయ పతాకాన్ని జూలై 22 రాజ్యాంగ పరిషత్ ఆమోదించిన సందర్భంగా దెందులూరు నర్సింగ్ కళాశాలలో సోమవారం పలు కార్యక్రమాలు నిర్వహించారు. కరస్పాండెంట్ సుగ్గిశెట్టి నూకరాజు ఆధ్వర్యంలో దెందులూరు నర్సింగ్ కళాశాలలో విద్యార్థులు 177 అడుగుల జాతీయ పతాకాన్ని ప్రదర్శించారు. పింగళి వెంకయ్య జాతీయ పతాకాన్ని రూపొందించి 1921లో విజయవాడలో నిర్వహించిన కాంగ్రెస్ సమావేశంలో ప్రదర్శించారని వివరించారు. కార్యక్రమంలో విద్యార్థులు, అధ్యాపకులు ఉన్నారు.

నేడు విద్యుత్ సరఫరా నిలుపుదల

నిడమర్రు: బువ్వనపల్లి విద్యుత్ సబ్‌స్టేషన్ పరిధిలోని అడవికొలనులో మంగళవారం ఉదయం 8 నుంచి 1 గంట వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తున్నట్లు ఏలూరు ఈఈ నటరాజన్ తెలిపారు. విద్యుత్ లైన్ల మరమ్మతులు, చెట్ల కొమ్మలతొలగింపు పనుల నిమిత్తం సరఫరా నిలుదల చేస్తామని తెలిపారు.

అభివృద్ధి పథంలో మార్కెట్ యార్డు



చేబ్రోలులో ప్రైవేటు భవనంలో మార్కెట్ కమిటీ కార్యాలయం



లోడు లారీల నుంచి మార్కెట్ సెస్సు వసూలు చేస్తున్న చెక్ పోస్టు సిబ్బంది

- ఏడాదికి 3.85 కోట్లకు పైగా ఆదాయం
- ఆరు చెక్ పోస్టుల ద్వారా సెస్సు వసూలు

ఉంగుటూరు: జిల్లాలోని మేటిగా ఉంగుటూరు మార్కెట్ యార్డు నిలుస్తోంది. ఇది జాతీయ రహదారిని ఆనుకుని ఉంది. కార్యాలయం చేబ్రోలులో ప్రైవేటు భవనంలో ఉంది. ఈ మార్కెట్ యార్డుకి సెస్సుల ద్వారా ఏడాదికి రూ.3 నుంచి 5 కోట్ల వరకూ ఆదాయం వస్తోంది. ఈ ఆదాయాన్ని పరిశీలిస్తే జిల్లాలో 2 లేదా మూడో స్థానంలో ఉంగుటూరు మార్కెట్ యార్డు నిలుస్తుంది. 2023-24 ఏడాదికి రూ.3,62,85,000 వేలు ఆధాయం వచ్చింది. వ్యవసాయ, వ్యయసాయేతర ఉత్పత్తులను మార్కెట్ సెస్సు చెల్లిస్తే గాని ఇతర ప్రాంతాలకు తరలించకూడదు. ఎగుమతులు పక్కదారి పట్టకుండా చెక్ పోస్టులు ఏర్పాటుచేసి సెస్సును వసూలు చేస్తుంటారు. వచ్చిన ఆదాయంలో చేపల ఎగుమతుల ద్వారా రూ.2,65,13,000, ధాన్యం ద్వారా రూ.48,78,000, మొక్కజొన్న ద్వారా రూ.43.88 లక్షలు, ఇతర పప్పుదినుసులు ఇతరరకాల ద్వారా రూ.1.06 లక్షల ఆదాయం చేకూరింది. ఈ రాబడితో జిల్లాలో అగ్రగామిగా నిలిచిన వాటిలో ఉంగుటూరు మార్కెట్ యార్డు కూడా చేరింది. గతంలో నల్లజర్ల, భీమడోలు మండలాలు ఉంగుటూరు మార్కెట్ యార్డులో ఉండేవి. నియోజకవర్గంలో గణపవరం, నిడమర్రు కలవడంతో నల్లజర్ల మండలం విడిపోయింది. ఇప్పుడు ఉంగుటూరు మార్కెట్ యార్డులో ఉంగుటూరు, గణపవరం, నిడమర్రు మండలాలున్నాయి. చేబ్రోలు, నారాయణపురం, సరి పల్లె, వరదరాజపురం, పిప్పర, చేబ్రోలు వద్ద చెక్‌పోస్టులు పని చేస్తున్నాయి. మూడేళ్లగా మార్కెట్ యార్డు ఆదాయం పరిశీలిస్తే 2021-22లో 4.45 కోట్లు, 2022-23లో 4.74 కోట్ల ఆదాయం వచ్చింది. ఈ ఏడాది ధాన్యం అమ్మకాల ద్వారా లభించాల్సిన సెస్సు పూర్తిస్థాయిలో అందాల్సి ఉంది. పౌరసరఫరాల శాఖ నుంచి ఆ సొమ్ము రావాల్సి ఉందని మార్కెట్ కమిటీ అధికారులు చెబుతున్నారు.




చేబ్రోలు సెంటర్లో ఉన్న చెక్‌పోస్టు

వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో అభివృద్ధికి నిధుల మంజూరు

కార్యాలయ నిర్మాణానికి ఉంగుటూరులో ఎగువ ప్రాంతంలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం హయాంలో స్థలాన్ని కొనుగోలు చేశారు. వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలోనే భవన నిర్మాణానికి రూ.50 లక్షలు, ప్రహరీ నిర్మాణానికి రూ.50 లక్షలు కేటాయించారు. గణపవరంలోని గోడౌన్ పునర్నిర్మాణానికి, మరమ్మతులకు రూ. 25 లక్షలు గతంలోనే మంజూరయ్యాయి.

అభివృద్ధికి అవకాశాలు



అధిక ఆదాయం వచ్చే వాటిలో ఉంగుటూరు మార్కెట్ యార్డు ఒకటి. వ్యవసాయ ఉత్పత్తులకు సెస్సు వసూలు చేయడంపై సిబ్బందిని ఎప్పటికప్పుడు అప్రమత్తం చేస్తున్నాం. మార్కెట్ యార్డు అభివృద్ధికి పుష్కలంగా అవకాశాలు, తగిన వనరులు ఉన్నాయి.

– ఎంటీవీ శ్రీనివాసరావు, ఏఎంసీ కార్యదర్శి సెస్సు వసూలు